నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను సోమవారం ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ, మండలస్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

విద్యార్థులపై ఒత్తిడి చేయద్దు

- అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని జూనియర్, డిగ్రీ, ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి రీయింబర్స్మెంట్ చేసే వరకు విద్యార్థులపై ఒత్తిడి చేయద్దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల విద్యార్థుల రీయింబర్స్మెంట్, మెస్ ఛార్జీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేసే వరకు విద్యార్థులపై సంబంధిత యాజమాన్యాలు రుసుము చెల్లించలేదని కారణంతో హాల్ టికెట్లు జారీ చేయకపోయినా, ఒరిజినల్ ధృవపత్రాలు ఇవ్వకున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థుల నుంచి అధిక రుసుము వసూలు చేసే కళాశాలలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

108 ఉద్యోగులను బెదిరించడం దారుణం

- తీవ్రంగా ఖండించిన సిఐటియు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా 108 ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం దశలవారీ పోరాటాలకు పిలుపునిచ్చి, 25 తర్వాత సమ్మెకు వెళ్లాలని ముందుగానే తెలియజేసినప్పటికీ చిత్తూరు ఒకటవ స్టేషన్ పోలీసులు 108 ఉద్యోగులను బెదిరించడాన్ని సిఐటియు చిత్తూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడ గంగరాజులు మాట్లాడుతూ రాష్ట్ర కేంద్రంలో నేటి నుంచి జరుగుతున్న నిరాహార దీక్షలకు చిత్తూరు జిల్లా నుంచి వెళ్తున్న 108 ఉద్యోగులను చిత్తూరు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి పదేపదే ఫోన్ చేస్తూ బెదిరింపులకు పాల్పడడం దారుణమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో వారు సమస్యలపై చేస్తున్న పోరాటాన్ని ఉక్కుపాదంతో మోపడం సరైనది కాదన్నారు. గత ప్రభుత్వంలో కూడా పోలీసులు ప్రజాఉద్యమాలపై ఉక్కుపాదం మోపారన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో కూడా నిర్బంధానికి పాల్పడం సరైంది కాదన్నారు. ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో మోపాలన ఎవరనుకున్నా అది రెట్టింపు స్థాయిలో జరుగుతుంది తప్ప ఆగిపోయే ప్రసక్తి లేదని తెలిపారు. 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు వారి పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలియజేశారు.

ఆదమరిస్తే అంతేగతి!

ఆ రహదారిలో ప్రయాణమంటే సాహసోపేతమే.. ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా అంతేసంగతి! కంకర తేలి.. గుంతలమయమై పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. కొత్త వారు గ్రామాలకొస్తే గాయాలపాలై వెలుతున్నారని అక్కడి స్థానికులంటున్న మాట. పేద జీవులు నివాస గ్రామాలేగా అలావాటైపోయిందో ఎంటోగానీ అలా కాలం నెట్టుకొస్తున్నారు. పాలకులను నిలదీద్దాం.. అధికారులను ప్రశ్నిద్దామంటే ఎన్నికల సమయం కాకపోయే.. పలకరించే గొంతు లేకపాయే.. పట్టించుకొనే నాదుడే కరువాయే.. అక్కడ ఎవ్వరిని పలకరించినా ఒకటే మాట.. ఐదేళ్లదాకా ఎవరు రారు.. పరిస్థితి మారదు అని తెగేసి అసహనంగా చెబుతున్నారు.

- ప్రజాశక్తి-వెదురుకుప్పం

నరకానికి నకళ్లులా..

- పేదల గ్రామాలకు అస్తవ్యస్తంగా రహదారి
- ఐదు కిలోమీటర్ల పొడవునా ఇదే పరిస్థితి
- కంకర తేలి.. నిత్యం ప్రమాదాలే..
- నరకానికి నకలుగా ఆ లింక్ రోడ్డు
- బాగు చేయాలని స్థానికుల మొర

జీడీ నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామం నుంచి కసవనూరు వరకు లింక్ రోడ్డు ఏర్పాటై ఏళ్లు గడిచింది. పచ్చికాపల్లం – కార్వేటినగరం జాతీయ రహదారిలో మాంబేడు సూచిక బోర్డు ఉంటుంది. అక్కడి నుంచి ప్రారంభమైన ఈ లింకు రోడ్డు కసవనూరు వరకు 10గ్రామాల మీదుగా వెళుతుంది.

సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలివే..

చిన్నమ్మ రెడ్డి కండ్రిగ, వెంకటరెడ్డి కండ్రిగ, దాట్లవారి ఇండ్లు, మాంబేడు, హరిజనవాడ, అరుంధతి వాడ, భారతీపురం, సింగపూర్ ఇండ్లు, కసుమూరు గ్రామం, ఆది అరుంధతి వాడ, కసుమనూరు గ్రామాల గుండా ఈ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డు కార్వేటినగరం జాతీయ రహదారిలో కలుస్తుంది. ఏళ్లు గడుస్తున్నా రహదారి మరమ్మతులు నోచుకోకపోవడంతో గుంతలు ఏర్పడి.. కంకర తేలిపోయింది. ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తున్న పది గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వరుస రోడ్డు ప్రమాదాలు..

కంకర తేలిన రోడ్లపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గుంతల వద్ద వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని, నిత్యం ఆసుపత్రి పాలవుతున్నట్లు వాపోతున్నారు. అటుగా వ్యవసాయ పొలాలకు వెళ్లాల్సి వస్తే అరికాళ్లకు కంకర గుచ్చుకొని బాధలు పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

సౌకర్యవంతంగా రోడ్డు ఏర్పాటు చేయాలి

మాంబేడు రోడ్డు నుంచి కార్వేటినగరం రోడ్డులో కలిసే లింక్ రోడ్డు వరకు మొత్తం పాడైపోయింది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి రోడ్డును బాగు చేయాలి. రాకపోకలకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చూడాలి.

- జయచంద్రయ్య, మాంబేడు, వెదురుకుప్పం మండలం

రోడ్డును బాగు చేయాలి

రోడ్డు మొత్తం గచ్చు తేలిపోయింది. ఎక్కడ చూసినా గుంతలే. వెళ్లాలంటే ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని వెళ్లాలి. ఈ రోడ్డులో తారు రోడ్డు వేయాలి. అప్పుడే ఇబ్బంది లేకుండా ఉంటుంది. భయం లేకుండా ఇంటికి చేరుతాం.

- నాధముని, మాంబేడు, వెదురుకుప్పం మండలం

నడవలేకుండా పోతున్నాం..



రోడ్డు మొత్తం గచ్చు తేలిపోయింది. చేను కాడికి వెళ్ళాలన్న ఇబ్బందిగా ఉంది. కాళ్లకు చెప్పులు లేకుండా పోతే అసలు నడవలేకుండా పోతున్నాం. మట్టి రోడ్డుగా ఉన్నప్పుడే బాగుండేది. ఈ రోడ్డును సరి చేయాలి.

- చంగల్ పండు, మాంబేడు, వెదురుకుప్పం మండలం

గుంతల రోడ్లు.. ప్రయాణపు పాట్లు

దలవాయిపల్లి వద్ద కంకర్లు తేలిన రోడ్డు

కొత్త వెంకటాపురం వద్ద గుంతల రోడ్డు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గ్రామీణ రోడ్లపై ప్రయాణం నరకంగా ఉంది. గత కొన్ని రోజులు క్రితం కురిసిన వర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు వెళ్ళే రోడ్లు గుంతలుగా ఏర్పడి అధ్వానంగా మారాయి. దీంతో ఈ రోడ్లలో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే నానావస్థలు పడుతున్నారు. మండలంలో వేల్కూరు మెయిన్ రోడ్ నుంచి పెద్ద కాల్వ, ముకుందరాయనిపేట, గారంపల్లె రోడ్, కొట్రకోన దళితవాడ, రోడ్లు ధ్వంసం అయింది. సిద్దేశ్వర కొండ మెయిన్ రోడ్ నుంచి దళవాయిపల్లె బస్టాప్ వద్ద నుంచి నరాలకండిగ సంసాపురం, కుమ్మరపల్లె హైవే రోడ్ జంక్షన్ వరకు కంకరరాళ్ళు తేలిపోయి గుంతలు మయంగా మారింది. గంగాధర నెల్లూరులో అలాగే కట్టకిందపల్లె దళితవాడకు, బంగారెడ్డిపల్లె, వేపంజేరి, అదేవిధంగా మంగినాయనికుప్పం నుంచి ఎండి మంగళం, తిరువీధికుప్పం, కడపగుంట సరిహద్దు వరకు రోడ్లు ధ్వంసం అయ్యాయి. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

నీటి సంరక్షణకు కృషి

- విజయకుమార్‌రెడ్డి, జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, మేజర్, మైనర్ చెరువుల్లో వర్షపు నీటిని నిల్వ చేసి సాగు, తాగునీరు అందించేందుకు జలవనరులశాఖ కృషి చేస్తోందని జలవనరులశాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సూపరింటెండెంట్ ఇంజనీర్ పర్యవేక్షణలో డీఈలు, ఏఈలు పనిచేస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల, రిజర్వాయర్ల నీటిమట్టాన్ని అంచనా వేయడంతో పాటు వర్షాల సమయంలో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. చిత్తూరు జిల్లాలో వర్షాలపైనే ఆధారపడాల్సి ఉండటంతో వర్షాలతో వచ్చే నీటిని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులు నింపేలా సప్లైయ్ ఛానల్స్ నిర్మించడం, చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

ప్రజాశక్తి: జిల్లాలో నీటి సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలేమిటి..?

ఎస్ఈ: జిల్లాలో మొత్తం వర్షాలపై ఆధారపడి సాగు, తాగునీటిని అందించాల్సి ఉంటుంది. ప్రాజెక్టు పరంగా చూస్తే కృష్ణాపురం ప్రాజెక్టు, ఎన్‌టిఆర్ జలాశయం ఉంది. మేజర్ చెరువులు దాదాపు 40 వరకు ఉన్నాయి. 2500 మైనర్ చెరువులు ఉన్నాయి. వీటికి సప్లైయ్ ఛానల్స్ ద్వారా వర్షాల సమయంలో నిండే అవకాశముంది.

ప్రజాశక్తి: నేతిగుంటపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్ల పరిస్థితి ఏమిటి..?

ఎస్ఈ: పుంగనూరు నియోజవర్గ పరిధిలోని నేతిగుంటపల్లి రిజర్వాయర్ ఒక టిఎంసి సామర్థ్యం ఈ రిజర్వాయర్ క్రింద 10వేల ఎకరాలు నూతన ఆయకట్టు ఉంటే ఐదు వందల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాగు జరుగుతోంది. 2.50 లక్షల జనాభాకు 0.25 టిఎంసి తాగునీరు అందించవచ్చు. అలాగే ఆవులపల్లి రిజర్వాయర్ కింద 40 ఎకరాల ఆయకట్టులో 20వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు సాగునీరు అందించబడుతుంది. 5 లక్షల జనాభాకు 0.5 టిఎంసి తాగునీరు అందిచవచ్చు.

ప్రజాశక్తి: కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి ఎలాంటి ప్రతిపాదనలు పంపారు..?

ఎస్ఈ: పలమనేరు నియోజకవర్గంలో పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, వీ కోట మండలాల్లో 931 చెరువుల కింద 18,727 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుల పునరుద్ధీకరణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. బైరెడ్డిపల్లి కౌండిన్య నదిపై 11 చెక్ డ్యామ్‌లు, పలమనేరు, నలగాంపల్లి వద్ద గంగమ్మ శిరస్తు కొత్త రిజర్వాయర్, వీ కోట గంగమ్మ ఏరు కొత్త రిజర్వాయర్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం.

ప్రజాశక్తి: కల్వకుంట జలాశయం (ఎన్‌టిఆర్ జలాశయం) అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్ఈ: ఇటీవల కురిసిన వర్షాలకు ఎన్‌టిఆర్ జలాశయం నుండీ దిగువకు నీటిని విడుదల చేయడం జరిగింది. వరద ప్రవాహ కాలవ తవ్వడానికి రూ.19323లక్షల అంచనా వ్యయంతో మంజూరు కావడం జరిగింది. ఈ మేరకు టెండర్లు పిలిచి ఒప్పదం కుదుర్చుకోవడం జరిగింది. పనులు పురోగతిలో ఉన్నాయి. చిత్తూరుకు తాగునీరు అందిచడంతో పాటు ప్రాజెక్టు దిగువ సాగునీరు అందించే అవకాశముంది.

ప్రజాశక్తి: జిల్లాలో జలసంరక్షణ కోసం ఏఏ పథకాలు అమలౌతున్నాయి..?

ఎస్ఈ: జిల్లాలో వరల్డ్ బ్యాంక్, ఏఐసిఐ పథకం ద్వారా ప్రాజెక్టుల ఆధునీకరణ, చెక్ డ్యామ్‌లు, రిజర్వాయర్ల నిర్మాణం, చెరువుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఒక్క చిత్తూరు నియోజకవర్గంలోనే వరల్డ్ బ్యాంక్ పథకం కింద 4 చెరువుల అభివృద్ధి పనులు రూ.377.02 లక్షల వ్యయంతో చేపట్టాం. గుడిపాల మండలంలో నాలుగు చెరువులు రూ. 455.85 లక్షల అంచనాతో చేట్టాం పురోగతిలో ఉన్నాయి. జేఐసిఏ నిధుల ద్వారా చేపట్టిన చెరువుల పనులు పూర్తి చేస్తే 1,872.90 ఎకరాల ఆయకట్టుకు నీరు అందిచవచ్చు. ఇలా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రభుత్వ ఆమోదంతో చేపట్టిన పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి మిగిలిన పనులకు ఆమోదం వస్తే జలవనరుల శాఖ ద్వారా వాటిని కూడా పూర్తి చేసి సాగు, తాగునీరు అందిండం జరుగుతుంది.

భద్రత లేని.. బతుకులు..

- క్రమబద్ధీకరణకు నోచని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు
- అందని కనీస వేతనం, సౌకర్యాలు

ప్రతి ఇంటిలో విద్యుత్ ఉండాలంటే విద్యుత్ శాఖలో పని చేసే కార్మికులు కీలకం. వారిలో ఎక్కువ మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న వారే ఉన్నారు. ఏళ్లుగా క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదు. కనీస వేతనం, పలు సౌకర్యాలు కూడా అందడం లేదు. భద్రత లేని బతుకులు సాగిస్తున్నారు..

- ప్రజాశక్తి- విజయపురం (నగరి)

విద్యుత్ శాఖలో నగరి, విజయపురం, నిండ్రలో 19 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 120 మంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. వివిధ విభాగాల్లో పోల్ టు పోల్ వర్కర్లు, మీటర్ రీడర్లు, షిఫ్ట ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్, సెంట్రల్ బ్రేక్ డౌన్ గ్యాంగ్ మెన్, కంప్యూటర్ ఆపరేటర్లు, టైపిస్టు, డ్రైవర్లు, హౌస్ కీపింగ్ కార్మికులు, బిల్ కలెక్టర్లు, బిల్లింగ్ క్లర్కులుగా పనిచేస్తున్నారు. హై స్కిల్డ్, స్కిల్స్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఏళ్ల కాలంగా పని చేస్తున్నా వారు క్రమబద్ధీకరణకు (రెగ్యులర్ చేసేందుకు) నోచుకోవడం లేదు. 2014 ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాకా పట్టించుకోలేదు.

2019 ఎన్నికల సమయంలో అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి కూడా రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. తరువాత అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ప్రభుత్వం కూడా రెగ్యులర్ చేయలేదు. దీంతో పాలకులు మారుతున్నా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదు. ఒకే పనిచేస్తున్న పాత వారికి, కొత్త కార్మికులకు సమానమైన వేతనాన్ని అమలు చేయడం లేదు. సబ్‌స్టేషన్లలో పనిచేసే వాచ్మెన్లను ఇతర పనులకు వాడుకుంటుండటంతో రాత్రిపూట ఆపరేటర్ ఒక్కరే ఉండి విధులు నిర్వహించాల్సి వస్తోంది. వాచ్మెన్లను ఫీల్డులో ఉపయోగించుకుంటున్నారు. స్కిల్డ్ పనులకు వాడుకుంటున్నా అన్ స్కిల్స్ వేతనాలనే చెల్లిస్తున్నారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు పదేళ్లు నిండితే గతంలో వారికి ఇంక్రిమెంట్ ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చాకా దాన్ని ఇవ్వడం లేదు. రిటైర్మెంట్ అయిన కాంట్రాక్టు విద్యుత్ కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ అందడం లేదు. విధి నిర్వహణలో ఉండి ప్రమాదాలు చోటు చేసుకుంటే ఎలాంటి సదుపాయాలూ అందడం లేదు. మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం, వారి కుటుంబ సభ్యులకు పెన్షన్ ఇవ్వడం లేదు. ఇపిఎఫ్, ఇఎస్ఐ, ఇన్స్యూరెన్స్ సక్రమంగా అమలు చేయడం లేదు. ఇప్పటికైనా ఓటమి ప్రభుత్వం కోరుతున్నారు.



చుడా ఛైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న కఠారి హేమలత

కఠారి హేమలత

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఇటీవల కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీలో భాగంగా చిత్తూరు మాజీ మేయర్ కఠారి హేమలతను చుడా ఛైర్ పర్సన్‌గా నియమించింది. చిత్తూరు అర్బన్ డెవలమెంట్ అథారి ఛైర్ పర్సన్‌గా హేమలత సోమవారం గిరింపేట చుడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. పార్టీ కోసం కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న హేమలత పార్టీ కోసం అంకిత భావంతో పని చేశారు. గత సాధారణ ఎన్నికల్లో నియోజవర్గంలో పార్టీ విజయం కోసం కృషి చేశారు. కష్టకాలంలో చిత్తూరు నగర అధ్యక్ష పదవిలో ఉంటూ తెలుగుదేశం పార్టీ విజయం కోసం పనిచేసిన హేమలతకు చుడా ఛైర్మెన్ పదవి ఇవ్వడం పట్ల కఠారి అభిమానులు, తెలుగుదేశం నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవర్స్ యూనియర్ అధ్యక్షులుగా శ్రీనివాస్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వ వాహన డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా వ్యవసాయశాఖలో పనిచేస్తున్న శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ప్రభుత్వ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్ష ఎన్నిక కోసం ఆదివారం స్థానిక సారధి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర నాయకులు చిరంజీవి వ్యవహరించారు. అధ్యక్ష పదవి కోసం వైద్య ఆరోగ్యశాఖలో పని చేసే పనీర్‌సెల్వం, శ్రీనివాస్ పోటీ పడ్డారు. అధ్యక్ష పదవి కోసం ఇరువురూ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్‌లో తేదీ కనబర్చడంలో పొరబాట్లు ఉండటంతో పనీర్ సెల్వం నామినేషన్‌న ఎన్నికల అధికారి తిరస్కరించడంతో శ్రీనివాస్‌ను జిల్లా అధ్యక్షులుగా ప్రకటించారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

- పారిశుధ్య కార్మికుల జిల్లా కార్యదర్శి మధు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రేపటి ధర్నాను జయప్రదం చేయాలని జిల్లా పారిశుధ్య కార్మికుల కార్యదర్శి మధు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ప్రజా సంఘాలు, సిఐటియు నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించేందుకు ధర్నా చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి

ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి శిలాఫలకానికి అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆదివారం రెడ్డివీధి, శివాజీ నగర్ కాలనీ కూడలిలో ఏఎస్ఐ రెడ్డిశేఖర్ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిలకు పూలమాలలు వేశారు. 2021 డిసెంబర్ నెలలో సామాజికవర్గ నేతలు పరస్పర గొడవలతో అంబేద్కర్ విగ్రహం, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అప్పటినుంచి అధికారకంగా ఇరువురికి వర్ధంతి, జయంతికి పూలమాలలు వేసి ఇవాళ అర్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకొని ఇరువర్గాల సామాజిక నేతలను అనుసరించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చూపాలని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

ఘనంగా కార్తీక వనభోజనోత్సవం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

ప్రజాశక్తి- పలమనేరు: మధు సంస్థల వ్యవస్థాపకుడు రిటైర్డ్ జడ్జి జి.మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పలమనేరులో ఆదివారం ఉదయం 11 గంటలకు పలమనేరు బైపాస్ హైలాండ్ హోటల్ వద్ద కమ్మ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనమహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తండ్రి చెన్నకేశవులు, రేవా హోటల్ యజమాని భీమినేని చిట్టిబాబు సుబ్రమణ్యం నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం బంగారు పాళ్యంకు చెందిన కృష్ణకుమారి మాట్లాడుతూ ప్రస్తుతం కుటుంబ బాంధ వ్యాలను వివాహ బంధాలను సరైన అవగాహన లేక చాలా మంది విడిపోతున్నారని తెలిపారు. నేటి తరం యువత కలిసి ఉమ్మడిగా జీవించడం అలవచ్చుకోవాలని కోరారు. అనంతరం అతిథులను పూలమలలు, శాలువతో కప్ప సన్మానించారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక ఏపీ ఎన్‌జీఓ హోంలో పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని డాక్టర్ అగర్వాల్ ఐ క్లినికి వైద్యబృందం పల్లవి, మణికంఠ, బాలాజీ, మేనేజర్ ఆంజనేయులు, పిపిఎస్ కార్యవర్గ సభ్యులు జగన్నాథం, దొరస్వామి, నారాయణ, సాంబయ్య, సన్నీ తెలిపారు. పట్టణ ప్రజలు, విశ్రాంత ఉద్యోగులు కంటి పరీక్షలు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు తెలిపారు.

ఆలయ భూమిని రక్షించండి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీ తొరడి గ్రామంలో వెలసిన శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయం మాన్యంను (సర్వే నెం.572,72 సెంట్లు) గ్రామస్తులు మెస్‌తో కాంపౌండ్ వాల్‌ను నిర్మించడం జరిగింది. కానీ శనివారం రాత్రి అదే గ్రామంలో యుండు నాగిరెడ్డి కుమారుడు అప్పిరెడ్డివారి సొంత అవసరాలకు గుడి మాన్యంకు నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను రాతి కూసాలు, మెస్ ధ్వంసం చేయడం జరిగింది. దీనికి కోదండ రెడ్డి, బాబురెడ్డి సహకరించడం జరిగింది. శనివారం రాత్రి మూడు చెట్లను, కాంపౌండ్ మెస్ వాల్ ను అప్పిరెడ్డి అనే వ్యక్తి సుధాకర్ రెడ్డి, బాబు రెడ్డి సహాయంతో ధ్వంసం చేయడం జరిగింది. అప్పిరెడ్డి అనే వ్యక్తి గుడి స్థలాన్ని ఆక్రమించుటలో పలు విధాల ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. కావున సంబంధిత అధికారులు అప్పిరెడ్డిపై తగు చర్యలు తీసుకోనీ గుడి మాన్యం స్థలానికి రక్షణ కల్పించాలని పోరాడి గ్రామస్తులు కోరుతున్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలో టిడిపి సభ్యత్వ నమోదును కార్యకర్తలు, నేతలు సమిష్టిగా కృషిచేసి సకాలంలో నమోదు చేయాలని రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణాచారి, మండల అధ్యక్షులు ఆనంద్ రెడ్డి పేర్కొన్నారు. అనంరతం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, చిన్నికృష్ణ, నందారెడ్డి, సీతాపతి, సుబ్రి, బాలు, రామకృష్ణప్ప, కామరాజ్ నాయక్, మనోహర్ పాల్గొన్నారు.

వాన నీరు కాదు.. మురుగునీరే..

- మోకాలి లోతు గుంతలలో నిల్వాలు
- వాహనదారులకు ఇక్కట్లు

రోడ్డుపై ఏర్పడ్డ గుంతలలో నిలువ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సోమల నుంచి నంజంపేట వెళ్లే మార్గమధ్యంలోని సరస్వతీపురం వద్ద గ్రామంలోని మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ మోకాలి లోతు గుంతలలో నిలిచి వాహనదారులు పాదాచారులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందిగా మారుతున్నాయి. గత మూడు సంవత్సరాలుగా సోమల నుంచి నంజంపేట ఆవులపల్లి పెద్ద ఉప్పరపల్లి మార్గానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయమై రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి ఆర్ అండ్ బి అధికారులు నిర్లక్ష్యం కారణంగా సంవత్సరాల తరబడి నాణ్యమైన రోడ్లు వేయకపోవడంతో పరిస్థితి ఇలా తయారైంది. ఉద్యోగస్తులు వృద్ధులు ద్విచక్ర వాహనంలో వెళ్లేవారు తమకు అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. గుంతలు తగ్గులు కారణంగా నడుము నొప్పులు, బాడీపెయిన్స్ వస్తున్నాయని అధికారులు స్పందించి తారు రోడ్డు వేయాలని కోరుతున్నారు. సాధారణ సమయంలో అయితే ఎక్కడ గుంత ఉందో ఎక్కడ రోడ్డు సక్రమంగా ఉందో తెలుసుకొని వాహనాలు వెళ్లే పరిస్థితి ఉంది. అలా కాకుండా వర్షం పడితే గుంతలు మొత్తం వాన నీటితో నిండిపోవడంతో రాకపోకలు సాగించాలంటే కూడా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరస్వతిపురం వద్ద మురుగునీరు మరొకవైపుకు ప్రవాహం మళ్ళించి రోడ్డుపై గుంతలలో మురుగునీరు నిలువ ఉండకుండా చూడాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంత ప్రజలు, వాహనదారులు, పాదాచారులు కోరుతున్నారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ వారిని కోరుతున్నారు. నెల్లిమంద పంచాయతీ నవాబుపేట వద్ద సోమల కందూరు మార్గ మధ్యంలో ప్రధాన రహదారిపై నవాబుపేట నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ వాహనాలు అటూ ఇటూ వెళ్లే సమయంలో పాదాచారులపై చిరుజల్లులు కురిపిస్తున్నాయి. స్థానిక పంచాయతీ వారు స్పందించి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

నవాబ్ పేట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

బంగారుపాళ్యం: జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీరు

జాతీయ రహదారిపైకి మురుగు నీరు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: జాతీయ రహదారిపై మురుగు నీరు ప్రవాహాన్ని అధికారులు పట్టించుకోక రహదారి అంతా దుర్వాసన వెదజల్లుతోంది. మండలంలోని మొగిలివారిపల్లి పంచాయతీ పాలమాకుల పల్లి గ్రామంలో మురుగు నీరంతా జాతీయ రహదారిపైకి ప్రవహిస్తున్నది. గతంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వీస్ రోడ్ ఏర్పాటు చేశారు. పక్కనే మురుగు కాలువ నిర్మాణాలకు చేపట్టకుండా వదిలేయడంతో నీరంతా జాతీయ రహదారిపై ప్రవహించి దుర్వాసన వస్తోంది. రహదారిగుండా వెళ్లాలంటేనే ఆ దుర్వాసనను భరించలేక కొందరు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మురుగు కాలువ నిర్మించి నీరు కాలువలో ప్రవహించే విధంగా చూడాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి..

సిఎంకి విన్నవించుకున్న కాంట్రాక్టు అధ్యాపకులు

నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తాత్కాలిక అధ్యాపకుల విఘ్నాలు తొలగించు విఘ్నేశా అంటూ తాత్కాలిక అధ్యాపకులు వినూత్న నిరసన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షులు చంద్రప్ప ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిజె గాంధీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యా వ్యవస్థలో అనేకమంది అధ్యాపకులు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నామని, వీరందరినీ శాశ్వత ఉద్యోగులుగా పరిగణిస్తూ, ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంతోకాలంగా పోరాటం చేస్తున్నామన్నారు. అలాగే వివిధ ప్రభుత్వశాఖలలో కాంట్రాక్టు ఉద్యోగులు వారి ఉద్యోగ భద్రతను కోరి పోరాడడం జరిగిందన్నారు. అందరి పోరాటం ఫలించి గత వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ 114 ను విడుదల చేస్తూ, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడం జరిగిందని, ఈ ఉత్తర్వులు విద్యాశాఖలో మాత్రం అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, తమ సమస్యలను పరిష్కరించి, తమను ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జైన్ సంఘం నేతృత్వంలో ప్రతినెలా చివరి ఆదివారం నిర్వహించే ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చిత్తూరు పరిసర గ్రామాల నుండీ పెద్దసంఖ్యలో కంటి పరీక్షల కోసం వైద్య శిబిరాన్ని ఆశ్రయించారు. వీరికి తిరుపతికి చెందిన అరవింద్ ఐ ఆసుపత్రి వైద్య నిపుణులు వైద్యపరీక్షలు నిర్వహించారు. 129 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 61 మందిని ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జైన్ సంఘం ప్రతినిధి సుభాష్ జైన్ మాట్లాడుతూ అందత్వ నివారణే లక్ష్యంగా జైన్ సంఘం 2004 నుండీ ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ కోసం ఎంపిక చేసిన వారికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పించి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. గత నెలలో

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

ఆపరేషన్లకు ఎంపికైన 51మందికి ఆదివారం రివ్యూ చెకప్‌లు చేసిన్నట్లు తెలిపారు. జైన్ సంఘం ప్రేమ్‌చంద్, విశాల్, సాగర్, ప్రవీణ్, లలిత్, జ్యోతి, కమలేష్, అమిత్‌కు కంటి రోగులకు సహాయ సహకారాలు అందించారు.

చిత్తూరు అభివృద్ధి కోసం పని చేస్తాం..

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు అభివృద్ధి కోసం పని చేస్తామని స్మార్ట్‌సిటీ డెవలప్మెంట్ సొసైటీ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక జీవ కారుణ్య సంఘంలో చిత్తూరు స్మార్ట్ సిటీ అంటే డెవలప్మెంట్ సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన చిత్తూరు నగర అభివృద్ధిపై పలువురు ప్రముఖులు ప్రసంగించారు. ముఖ్యంగా తాగునీరు, హై రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ, చర్చి, బజారు వీధులలో వన్ వే, యూనివర్సిటీ, అండర్ డ్రైనేజీ వ్యవస్థ, అనధికారిక స్పీడ్ బ్రేకర్లను తొలగించడం, పారిశుధ్య నిర్వహణ, రోడ్ల పైన ఉన్న గుంతలు పూడ్చడం, కల్వర్టులు కట్టడం తదితర సమస్యలపై చర్చించి పరిష్కార దిశగా అడుగులు వేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ తాండవ మూర్తి, శివకుమార్, సత్య, గోపి నాయక్, కేశవరెడ్డి, అశోక్ కుమార్, శ్రీనివాసమూర్తి, మురళి, రైస్ రాము, శ్రీనివాస బాబు, విలేకరులు సింగ్, బొట్టు స్వామి, వరద రాజులు, చిన్నా పాల్గొన్నారు.

నేడు వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామివారి అష్టమ వార్షిక కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నేడు సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. ఆదివారం స్వామివారి ఆలయం వద్ద చలువ పందిళ్లు రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణలు చేశారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి మహా మంగళహారతిని అందజేశారు. సోమవారం రాత్రి తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్టు వారిచే భక్తి గీతాలు తదుపరి హరికథ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రి 10 గంటల నుండి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కుప్పం పోలీసులకు అభినందనలు


పోలీసులను సన్మానిస్తున్న చంద్రకళ

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం సిఐ మల్లేష్ యాదవ్, రాళ్ళబుదుగురు, గుడుపల్లి ఎస్సైలు, సిబ్బందిని టిడిపి మహిళా విభాగం చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకళ ఘనంగా సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాంతిపురం మండలం ముల్లూరు కృష్ణాపురం గ్రామానికి చెందిన ఒక మహిళ రోడ్డుపై వెళుతుండగా కొందరు దుండగులు మహిళ మెడలోని గొలుసును లాక్కెళ్ళడం జరిగిందన్నారు. ఈ విషయమై బాధితురాలు వెంటనే పోలీసులను సమాచారం అందించగా, స్పందించిన పోలీసులు వెంటనే సీసీ కెమెరాల సాయంతో దుండగులను గుర్తించి, ఒక నెల రోజులలో దొంగతనానికి గురైన గొలుసును బాధితురాలకు అప్పగిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. వారు చెప్పిన విధంగానే దుండగులను అదుపులోనికి తీసుకుని బాధితురాలు పోగొట్టుకున్న సొత్తును ఆమెకు అప్పగించడం హర్షించదగ్గ విషయమన్నారు.

తాజా మాంసాన్నే విక్రయించాలి

పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం పట్టణంలోని మాంసం, చేపల దుకాణాలను పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు ఆదివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన బైపాస్ రోడ్డులోని మాంసం, చేపల దుకాణాల పరిసరాలను పరిశీలించి, వ్యాపారులతో మాట్లాడుతూ నాణ్యమైన, తాజా మాంసాన్ని మాత్రమే విక్రయించాలన్నారు. ముఖ్యంగా చేపల వ్యాపారులు తాజాగా ఉన్న చేపలు మాత్రమే విక్రయించాలని సూచించారు. నిల్వ ఉంచిన, చెడిన మాంసాన్ని విక్రయించిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా రోడ్లపై పక్క వ్యాపారం చేసుకునేవారు ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలు ముఖ్యం..!

రామకుప్పం ఎస్సై వెంకట మోహన్

ప్రజాశక్తి - రామకుప్పం: శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజల భాగస్వామ్యం అను అంశంపై మండల కేంద్రంలో ప్రముఖులు, నాయకులతో ఆదివారం రామకుప్పం సబ్ ఇన్స్పెక్టర్ వెంకట మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రతి ఒక్కరు అప్రమత్తతో ఉండి గ్రామాల ముఖ్యకూడలి వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలం శాంతి భద్రతల విషయంలో అందరూ మంచిగా ప్రవర్తించి ముఖ్యమంత్రికి మంచిపేరు తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా మండల పరిధిలో ప్రతి దేవాలయాల వద్ద ఆటోమేటిక్ లాక్స్‌ను వినియోగించుకోవాలని దీనికి ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు.

క్రైం కార్నర్

అక్రమ మద్యం స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సహదేవి ఆదివారం తెలిపారు. వివరాలు.. అక్రమ మద్యం రవాణాపై తనిఖీలు చేస్తుండగా కరసనపల్లెకు చెందిన శివరాజును శ్రీరామపురం క్రాస్, కరసనపల్లి రోడ్డు వద్ద అరెస్ట్ చేశామని ఎస్ఐ తెలిపారు. 90ఎంఎల్ కర్ణాటక మద్యం 17 టెట్రా ప్యాకెట్లు, ఒక లీటరు నాటు సారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇదివరకే అతనిపై పంజాని పోలీస్ స్టేషన్‌లో 5 కేసులు, పుంగనూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 3 కేసులు ఉన్నాయన్నారు. నిందితుడిని రిమాండ్‌కి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

అదృశ్యమైన యువకుడు.. పాలారు నదిలో శవమై తేలాడు..

ప్రజాశక్తి- వీకోట: మండల పరిధిలోని కొంగాటం పంచా యతీ చింతల ఎల్లాగరంకు చెందిన సుభాన్ కుమారుడు నవాజ్ (అల్లు) 27 సంవత్సరాలు గత మూడు రోజులు అదృశ్యమై ఆదివారం ఉదయం పాలారు నదిలో శవమై తేలాడు. చింతలఎల్లాగరంకు చెందిన నవాజ్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. అతనికి షాహినా అనే భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన సర్దార్‌తో కలిసి చేపలు వేటకు బయటకు అలవాటుగా వెళ్లేవాడు. యథావిధిగా నవాజ్ గురువారం అతనితో వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. రెండు రోజులు కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో అతనిని తీసుకెళ్లి సర్దార్‌ను ప్రశ్నించడంతో అతను పరారయ్యాడు. దీంతో మృతుడి తల్లి రెహానా శనివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా వీ కోట సిఐ సోమశేఖర్ రెడ్డి యువకుడు అదృశ్యంపై కేసు నమోదు చేశారు. నిందితుడుగా అనుమానిస్తున్న సర్దార్ కుటుంబ సభ్యులను తీసుకువచ్చి పోలీసులు విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. ఆర్థిక లావాదేవీల కారణంగా నవాజ్‌ను సర్దార్ తీసుకెళ్లి హతమార్చి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. నవాజ్‌ను హతమార్చి కొల్లుపల్లిరోడ్డులో కృష్ణారెడ్డి భూముల పక్కన పాలారు నదిలో పడేసినట్లు నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు వెతికగా ఎట్టకేలకు మృతదేహం పొదల మధ్య బయటపడింది. మృతదేహాన్ని చంపి డ్రిప్ పైపులతో కట్టినట్లు తెలుస్తోంది. పోలీసులు ఈ మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం జరగవలసిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్టు పిడి వికాస్ మరమత్ తెలిపారు. వాటి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో భాగంగా ప్రతి సోమవారం కుప్పం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయ సమావేశ మందిరంలో కడా పిడి ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహించడం కొనసాగుతోంది. ఈ కార్యక్రమం నవంబర్ 25వ తేదీన జరగవలసి ఉండగా, కొన్ని అనివార్య కారణాలవల్ల సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు తెలిపారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలో ఎస్సై శివకుమార్, సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం పుంగనూరు – తిరుపతి మార్గంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. తాగి వాహనాలు నడపడం రికార్డులు లేకుండా రోడ్డుపై వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని ప్రతి ఒక్కరూ తమ వాహనానికి సంబంధించిన రికార్డులను డ్రైవింగ్ లైసెన్సు తమ వద్ద ఉంచుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :: PUTTUR.
O.S.No.6 /2017

Betwecn:
N. Kanchana .....Plaintiff.
And:
V.Subramanyam Naidu (died) and others ......Defendants.

SUMMONS TO DEFENDANT No.6.

To
D6) Y. Indraja,
D/o Late. Y. Jayaramudu,
Chengamanaidukandriga H/W,
Jagannadhapuram post,
Vijayapuram Mandal, Chittoor district.
Madam,

Please take summons that the plaintiff filed the above suit against you and others for partition of the plaint schedule properties. The said suit was posted to 29-11-2024 for your appearance in the above suit. If you have got any objections you may appear on 29-11-2024 at 10.30 A.M. either in person or through your counsel and file your objections. In the event of your failure. the matter will be decided exparte.
Hearing: 29-11-2024.

Sri K. Purushotham, M.A., B.L.,
Advocate for plaintiff.